నేడు విద్యుత్‌ సరఫరా బంద్‌

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఎస్‌ఎండీసీ కాలనీ, అనంత సరస్వతీ నగర్‌ ఫీడర్ల మరమ్మతుల వలన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కళ్యాణ్‌నగర్‌, ఎస్‌ఎండీసీ కాలనీ, ఈస్ట్‌ ఆనంద్‌ బాగ్‌, బ్యాంక్‌ కాలనీ, తాళ్లబస్తీ, అనంత సరస్వతీనగర్‌ షిరిడీనగర్‌, ఆదర్శ్‌నగర్‌ ప్రాంతాల్లో.., 11కేవీ ఆర్‌కేనగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆర్‌కేనగర్‌, చాణక్యపురికాలనీ, ఆనంద్‌బాగ్‌ వెస్ట్‌ ప్రాంతాల్లో, 11కేవీ పీబీ కాలనీ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పూలపల్లి బాలయ్య కాలనీ, ఎస్‌బీహెచ్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు.

కుషాయిగూడ: సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌లో భాగంగా మౌలాలి సబ్‌స్టేషన్‌, పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మీర్‌పేట్‌ ఫీడర్‌ పరిధిలోని మీర్‌పేట్‌, తిరుమలనగర్‌, న్యూశ్రీనగర్‌ కాలనీ, కృష్ణానగర్‌ ఫీడర్‌ పరిధిలోని కృష్ణానగర్‌ కాలనీ, మంగాపురం కాలనీ పార్టులో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

కమిషనర్‌ ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో కమిషనర్‌ శైలజ

బోడుప్పల్‌: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబదేవి ఆలయంలో బోడుప్పల్‌ కమిషనర్‌ శైలజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయాన్ని సందర్శించగా ఆలయ చైర్మన్‌ వినోద్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్‌, ప్రధాన అర్చకులు చంద్రశేఖర్‌శర్మ సత్కరించారు. మాజీ కార్పొరేటర్‌ కొత్త దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



వెంకటాపురంలో పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ సబితకిషోర్‌

అల్వాల్‌: వెంకటాపురం డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్‌ సబితకిషోర్‌ అన్నారు. వెస్ట్‌ వెంకటాపురం శివాలయం వద్ద నీటి పైపులైన్‌ మళ్లింపు పనులను జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ సబిత కిషోర్‌ మాట్లాడుతూ వెంకటాపురం డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసుతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తూ..

గౌతంనగర్‌: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సెవెన్‌హిల్స్‌ పాఠశాల కరస్పాండెంట్‌ శేషసాయి అన్నారు. మల్లికార్జునగర్‌లోని సెవెన్‌హిల్స్‌ పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా స్పోర్ట్స్‌ డే వేడుకలను మల్లికార్జుననగర్‌ ఫ్రెండ్స్‌ అసోషియేషన్‌ గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖోతో పాటు ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మల్లికార్జునగర్‌ కాలనీ ప్రతినిధులు కే.విజయప్రసాద్‌రెడ్డి, వెంకటయ్య, వాసంశెట్టి శ్రీనివాస్‌, బండారి రవి, బైరు అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

ఉప్పల్‌: అనారోగ్యంతో పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. రామంతాపూర్‌ ఇందిరానగర్‌ కాలనీకి చెందిన విజయ్‌కుమార్‌ కూతురు నీలం పవిత్ర (15) స్థానికంగా ఓ ప్రైవేట్‌ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. కూతురి ఆరోగ్యం బాగాలేకపోవడంతో తల్లి నీలం పావని శుక్రవారం స్కూల్‌ నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లింది. అనంతరం ఇంట్లో కూతుర్ని వదిలేసి బ్యాంక్‌ పనిమీద వెళ్లింది. తిరిగి వచ్చేసరికి పవిత్ర ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. స్థానికుల సాయంతో కిందకు దించగా అప్పటికే మృతి చెందింది. తల్లి పావని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

చుక్కలు చూపిస్తున్న ట్రాఫిక్‌

- నేతాజీనగర్‌ చౌరస్తాలో నిత్యనరకం
- రోడ్ల విస్తరణ లేక సమస్య ఉత్పన్నం
- ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్‌లు
- రోడ్ల ఆక్రమణలతో సమస్య జటిలం
- ఎవరూ స్పందించక జనం ఇబ్బందులు

కాప్రా: నగర శివారు ప్రాంతంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ట్రాఫిక్‌ సమస్య తీవ్రమవుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌ సమస్య నగరవాసులకు చుక్కలు చూపిస్తోంది. శివారు ప్రాంతాలు విస్తరిస్తున్నా అందుకు అనుగుణంగా వసతులు మాత్రం కల్పించలేకపోతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి, ప్రజాప్రతినిధులు మారుతున్నా సమస్య మాత్రం ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంటుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన దృష్టి పెట్టకపోవడమే ట్రాఫిక్‌ సమస్యకు ప్రధాన కారణం అంటున్నారు స్థానికులు.

సిగ్నలింగ్‌ వ్యవస్థ లేక..

కాప్రా డివిజన్‌ నేతాజీనగర్‌ చౌరస్తాలో ట్రాఫిక్‌ ప్రధాన సమస్యగా మారిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌ సమస్యతో సమయానికి స్కూళ్లకు, ఆఫీసులకు వెళ్లలేకపోతున్నారు. నేతాజీనగర్‌ చౌరస్తాకు కందిగూడ మార్గం, ఎల్లారెడ్డిగూడ, కాప్రా మార్గం నుంచి హైటెన్షన్‌ రోడ్డు మార్గాలన్నీ నేతాజీనగర్‌ చౌరస్తా నుంచి ఏఎస్‌రావునగర్‌–సైనిక్‌పురి ప్రధాన రహదారికి చేరుకుంటారు. ఈ మూడు మార్గాల నుంచి చౌరస్తాకు చేరుకోవడంతో అక్కడ సిగ్నలింగ్‌ వ్యవస్థ లేక సమస్య ఉత్పన్నమవుతోంది. ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, రాత్రి సమయంలో ట్రాఫిక్‌ జామ్‌ అవుతోంది. రాధిక చౌరస్తా, కాప్రా చౌరస్తా, నేతాజీనగర్‌ చౌరస్తా, సైనిక్‌పురి చౌరస్తా, సాకేత్‌, దమ్మాయిగూడ చౌరస్తాలో ట్రాఫిక్‌ జామ్‌తో ఇబ్బంది పడుతున్నారు.

రోడ్ల విస్తరణ ఎప్పుడో..

కాప్రా డివిజన్‌ నలుమూల నుంచి వచ్చే ఇతర ప్రాంతాల వాహనదారులు ఈ మార్గాన్నే ఎంచుకుంటున్నారు. అంబేడ్కర్‌ నగర్‌, దమ్మాయిగూడ, నాగారం, ఎల్లారెడ్డిగూడ, వంపుగూడ నుంచి వచ్చే వాహనదారులు కాప్రా, నేతాజీనగర్‌, రాధిక చౌరస్తా మీదుగా అటు తార్నాక, ఇటు సికింద్రాబాద్‌ వైపు వెళ్తుంటారు. దీంతో వాహనాల రద్దీ పెరుగుతున్నా అందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ జరకపోవడంతో సమస్య మరింత తీవ్రమవుతోంది. దానికితోడు ఆక్రమణలతో రోడ్లు ఇరుగ్గా మారి ట్రాఫిక్‌ కష్టాలు నెలకొంటున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.







కాప్రా చౌరస్తాలో నిలిచిన వాహనాలు

అనుమతులు లేకుండా షట్టర్ల నిర్మాణం

- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు
- ఇప్పటికైనా స్పందించాలంటున్న స్థానికులు



అక్రమంగా నిర్మిస్తున్న షట్టర్లు

బోడుప్పల్‌: చెంగిచర్ల పాత గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న 11 షట్టర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చ కిషన్‌ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్యాంప్‌ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో చెట్లను నరికి స్కూల్‌ ఆవరణలోకి గాలి, వెలుతురు రాకుండా స్కూల్‌ వాతావరణం పూర్తిగా దెబ్బతినే విధంగా నిర్మిస్తున్నారు. వెయ్యి మంది విద్యార్థులున్న ఈ స్కూల్‌లో విద్యార్థులు బయటకు వెళ్లడానికి, లోపలికి రావడానికి ఒక్కటే గేట్‌ ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయమై గతంలో మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌, బోడుప్పల్‌ కమిషనర్‌ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అక్రమంగా నిర్మిస్తున్న షట్టర్లను నిలిపివేయాలని ఫిర్యాదులో కోరారు.

డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

మల్లాపూర్‌: అన్నపూర్ణ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని ఈఈ నాగేందర్‌ అన్నారు. అన్నపూర్ణ కాలనీలో డ్రైనేజీ సమస్యను శుక్రవారం పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈని కోరారు. సమస్యను పరిష్కరించాలని గతంలో ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి నెమలి అనిల్‌, శ్రీకాంత్‌రెడ్డి తీసుకువెళ్లారు. వెంటనే పనులు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులను పరమేశ్వర్‌రెడ్డి ఆదేశించడంతో ఇంజినీరింగ్‌ అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి తదితరులున్నారు.



అన్నపూర్ణ కాలనీలో పర్యటిస్తున్న ఇంజినీరింగ్‌ అధికారులు

నిధులు మంజూరు చేయాలని జెడ్సీకి వినతి



జెడ్సీకి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌

మల్లాపూర్‌: నాచారంలోని అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎల్బీనగర్‌ జెడ్సీ హేమంత్‌ కేశవ పాటిల్‌కు నాచారం డివిజన్‌ కార్పొరేటర్‌ శాంతి సాయిజెన్‌శేఖర్‌ వినతి పత్రం అందజేశారు. ఓల్డ్‌ విలేజ్‌లో రోడ్డు పనులు, నాచారం వార్డు కార్యాలయానికి లిఫ్ట్‌ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్‌ తెలిపారు.

అల్వాల్‌ సర్కిల్‌ కాంగ్రెస్‌ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా వీనస్‌ మేరి

అల్వాల్‌: అల్వాల్‌ సర్కిల్‌ కాంగ్రెస్‌ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా వీనస్‌ మేరి నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు, జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుల సహకారంతో తనకు అల్వాల్‌ సర్కిల్‌ కాంగ్రెస్‌ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా నియామక పత్రాలను శుక్రవారం అందజేసినట్లు వీనస్‌ మేరీ తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న వీనస్‌ మేరీ

నేడు దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్‌: చెంగిచర్ల ఆర్టీసీ కాలనీ, హరితవనం కాలనీలో ఉన్న అభయప్రద ఫౌండేషన్‌ స్పెషల్‌ స్కూల్‌ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు ధనలక్ష్మి ఒక ప్రకటనలో వెల్లడించారు. శనివారం ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వినికిడి లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం, మానసిక వైకల్యం గల పిల్లలకు డాక్టర్లచే వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు. వాటితో పాటు స్పీచ్‌ థెరపీ, యోగా థెరపీ, బిహేవియర్‌ థెరపీ, గ్రూప్‌ క్లాస్‌ రూమ్స్‌, ఆక్యుపేషనల్‌ థెరపీ, రాయడంలో శిక్ష , సైకాలాజికల్‌ థెరపీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఇతర సమాచారం కోసం ఫోన్‌: 99494 94809.

140 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత

ఉప్పల్‌: ఉప్పల్‌ పారిశ్రామికవాడలో అక్రమంగా తరలిస్తున్న 140 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని ఉప్పల్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉప్పల్‌ పారిశ్రామికవాడలోని జెడ్సీ కంపెనీ వద్ద ఉన్న పార్కింగ్‌ స్థలంలోని వ్యాన్‌లో పీడీఎస్‌ రైస్‌ ఉందని శుక్రవారం మధ్యాహ్నం ఉప్పల్‌ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రేషన్‌ బియ్యం ఉన్న వాహనంతో పాటు అందులోని 140 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్‌ చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. అక్కడే ఉన్న ట్రక్కు డ్రైవర్‌ వెంకటరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అసలు సూత్రధారుల కోసం వేట ప్రారంభించారు.

సర్వోదయ యజమానిపై ఫిర్యాదు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో ఈ నెల 4న సర్వోదయ కెమికల్‌ కంపెనీలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై బాధిత కంపెనీల యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వోదయ కెమికల్స్‌ కంపెనీ యజమాని బాల్‌రెడ్డి ఎలాంటి రక్షణ చర్యలు, జాగ్రత్తలు లేకుండా కెమికల్‌ కంపెనీ నిర్వహించడం వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని డీవీపీఎస్‌, ఫ్లోరోషీల్డ్‌ కంపెనీల యజమానులు బానోతు సురేంద్రనాయక్‌, దస్తగిరిరెడ్డి చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని, బాల్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ రవికుమార్‌ తెలిపారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



కమిటీ ప్రతినిధులను అభినందిస్తున్న జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌ నాయక్‌

కుషాయిగూడ: లంబాడీలు ఐక్యంగా హక్కులు సాధించుకోవాలని సద్గురు సేవాలాల్‌ మహారాజ్‌ జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు ధీరావత్‌ శ్రీనివాస్‌ నాయక్‌ అన్నారు. మారుతీనగర్‌లో చర్లపల్లి డివిజన్‌ ఉత్సవ నూతన కమిటీ శుక్రవారం ఎన్నికయ్యింది. ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ధీరావత్‌ హన్మంతు నాయక్‌, సెక్రటరీగా ధీరావత్‌ శ్రీనివాస్‌నాయక్‌, కోశాధికారిగా ధీరావత్‌ రెడ్యానాయక్‌, ఉపాధ్యక్షుడిగా కిషన్‌నాయక్‌, సతీష్‌ నాయక్‌, లింగం నాయక్‌, జాయింట్‌ సెక్రటరీగా శ్రీనివాస్‌ నాయక్‌ను ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

అల్వాల్‌: వెంకటాపురం డివిజన్‌ వెంకటరావు పేటలోని నల్ల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. కార్పొరేటర్‌ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కె.వాణిశైల్వి, విశాల్‌, రామానుజం, సాగర్‌, స్థానిక నాయకులు యాదిగిరిగౌడ్‌, ప్రేమ్‌కుమార్‌, సాజిత్‌, అరుణ్‌, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు



మౌలాలి: కేంద్రం అమలు చేస్తున్న పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ కూడా పేదలకు ఎంతో మేలు చేసేలా ఉందని వినాయక్‌నగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు గెల్ల బోయిన శ్రీకాంత్‌యాదవ్‌ అన్నారు. వినాయకనగర్‌ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కువ శాతం ఉన్న మధ్య తరగతి వాళ్లకు రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గౌలికర్‌ ఆనంద్‌, నవీన్‌, కిరణ్‌, ముదిరాజ్‌, సుశీల, జయమ్మ, శంకర్‌గౌడ్‌, శ్రీనివాస్‌ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి కానుకగా స్వర్ణ యజ్ఞోపవీతం



స్వామి వారికి కానుకగా స్వర్ణ యజ్ఞోపవీతం అందజేసిన శ్రీనివాస్‌

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలోని మూలవిరాట్‌కు మరో స్వర్ణాభరణం కానుకగా అందింది. గౌతంనగర్‌కు చెందిన న్యాయవాది రేఖ శ్రీనివాస్‌ సుమారు 49.940 గ్రాముల బంగారు యజ్ఞోపవీతాన్ని కానుకగా అందజేశారని ఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్వామి వారికి అలంకరించి అర్చకులు ముదుంబై వేంకటరమణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను సన్మానించి స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు తులసి రమణాచార్యులు, క్లర్క్‌ సుధాకర్‌, జోగేశ్వర్‌, సంజయ్‌గుప్తా, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవి మాత త్రిసప్తతి బ్రహ్మోత్సవాలు

రామంతాపూర్‌: వెంకట్‌రెడ్డినగర్‌లోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారి 37వ త్రిసప్తతి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులైన అర్చకులు సుప్రభాతం మూల దేవతల అలంకారం , అభిషేకం, నిత్య పూజ, స్వస్తివచనం, కలశ స్థాపన అంకురార్పణం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు గంజి రాజమౌళిగుప్తా, అధ్యక్షుడు భువనగిరి శ్రీనివాస్‌, ఊరే నగేష్‌గుప్తా, కొండయ్యగుప్తా, కొత్తపల్లి రమేష్‌గుప్తా, పల్లెర్ల భిక్షపతి, గంజి అమృతమ్మ, శంభు, జయమ్మ, బోనగిరి పద్మ, విశ్వనాథ సుజాత తదితరులు పాల్గొన్నారు.



9 రోజుల పాటు అత్యంత వైభవంగా పూజలు



భక్తులతో ఈఓ రవీంద్రారెడ్డి తదితరులు

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ, మంగాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ముగిశాయి. 9 రోజుల పాటుగా పండగ వాతావరణంలో అత్యంత ఉత్సాహంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. ప్రతిరోజూ వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలతో పాటు స్వామివారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. శ్రీవారి నామస్మరణతో పాటు భక్తుల కోలాటాలు, భజనలతో మంగాపురం వీధులు మార్మోగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా త్రిదండి చినజీయర్‌ స్వామి చేతులమీదుగా గోపుర ప్రతిష్ఠ నిర్వహించారు. స్వామివారి సేవల్లో పాత్రులైన వారిని ఆలయ ఈఓ ఏబీ రవీంద్రారెడ్డి అభినందించి సత్కరించారు.

ట్రేడ్‌ లైసెన్స్‌ లేకుంటే దుకాణాలు సీజ్‌ చేస్తాం



వినాయక్‌నగర్‌ దుకాణాలలో ట్రేడ్‌ లైసెన్స్‌ను పరిశీలిస్తున్న సర్కిల్‌ వైద్యాధికారి మంజుల

మౌలాలి: ట్రేడ్‌ లైసెన్స్‌ లేకుంటే వ్యాపార సముదాయాలు సీజ్‌ చేస్తామని మల్కాజిగిరి సర్కిల్‌ వైద్యాధికారి మంజుల పేర్కొన్నారు. మల్కాజిగిరి సర్కిల్‌ పరిధిలోని వినాయక్‌నగర్‌, మౌలాలి తదితర ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలను ఆమె పరిశీలించారు. ట్రేడ్‌ లైసెన్స్‌లు ఉన్న వారు వెంటనే రెన్యువల్‌ చేసుకోవాలని సూచించారు. కొన్ని వ్యాపార సముదాయాలు ట్రేడ్‌ లైసెన్స్‌లు లేకుండా కొనసాగుతున్నాయని, వారు వెంటనే ట్రేడ్‌ లైసెన్స్‌ తీసుకోవాలని సూచించారు. లేదంటే 25 శాతం జరిమానా విధిస్తామని తెలిపారు. ఈ నెల 28లోపు చెల్లించాలి. లేదంటే దుకాణాలు సీజ్‌ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు జితేందర్‌ రెడ్డి, రాము, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తీన్మార్‌ మల్లన్నపై అల్వాల్‌ పీఎస్‌లో ఫిర్యాదు

అల్వాల్‌: రెడ్డి కులస్తులు, అగ్రవర్ణాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న చింతపండు నవీన్‌ అలియాస్‌ తీన్మార్‌ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం అల్వాల్‌ రెడ్డి సంఘం ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4వ తేదీన వరంగల్‌లో జరిగిన బీసీ సభలో తీన్మార్‌ మల్లన్న(ఎమ్మెల్సీ) రెడ్డి, అగ్రవర్ణాలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, యూట్యూబ్‌ చానెల్స్‌లో కూడా రెడ్డిలపై, ఈబీసీ రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రెడ్డి కులస్తులను కించపరుస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తీన్మార్‌ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అల్వాల్‌ రెడ్డి సంఘం ప్రతినిధులు అల్వాల్‌ పోలీసులకు వినతి పత్రం అందజేశారు.



అల్వాల్‌ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న అల్వాల్‌ రెడ్డి సంఘం ప్రతినిధులు

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు

చిలుకానగర్‌ డివిజన్‌ బ్యాంకు కాలనీలో ఆక్రమణల తొలగింపు



ఉప్పల్‌ బ్యాంక్‌ కాలనీలో రోడ్డు చేపట్టిన నిర్మాణాన్ని తొలగించిన జీహెచ్‌ఎంసీ అధికారులు

ఉప్పల్‌: ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి ప్రజల ఇబ్బందులు సృష్టిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఉప్పల్‌ డిప్యూటీ కమిషనర్‌ ఆంజనేయులు హెచ్చరించారు. ఈ మేరకు ఉప్పల్‌ బ్యాంక్‌ కాలనీలోని రోడ్డుపై ఉన్న అక్రమ నిర్మాణాన్ని, ఫుట్‌పాత్‌లను జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. అంతకు ముందే సదరు వ్యక్తులకు నోటీసులు అందజేసి హెచ్చరించినా ఫలితం లేకపోవడంతోనే కూల్చివేసినట్లు తెలిపారు. ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఉన్న నిర్మాణాలను తొలగిస్తామన్నారు. ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 15 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో చిన్న డబ్బా పెట్టుకొని పాల ప్యాకెట్లు విక్రయించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని, ఇప్పుడు తన జీవనోపాధి పోయిందని ఓ మహిళ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

ట్రంక్‌ లైన్‌ క్లీనింగ్‌ ప్రక్రియ సులభం

ఉప్పల్‌: ఉప్పల్‌ సర్కిల్‌ పరిధిలో కొనసాగుతున్న ట్రంక్‌ లైన్‌ క్లీనింగ్‌ పనులను శుక్రవారం మెట్రో వాటర్‌ వర్క్స్‌ సీజీఎం సుజాత, ఉప్పల్‌ కార్పొరేటర్‌ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. రామంతాపూర్‌ పరిధిలోని పలు కాలనీల నుంచి ఉప్పల్‌ చేరుకునే మురుగు కాల్వ, అవుట్‌లెట్‌ సరిగ్గా లేని కారణంగా ఇక్కడి ప్రజలు నిత్యం నరకయాతన అనుభవించే వారని, ఇప్పుడు సూపర్‌ సక్కర్‌తో ట్రంక్‌ లైన్‌ క్లీనింగ్‌ ప్రక్రియ చాలా సులభం అయ్యిందని కార్పొరేటర్‌ అన్నారు. త్వరలో ఈ ప్రాంతవాసులకు మురుగు సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. వాటర్‌ వర్క్స్‌ జీఎం సంతోష్‌, డీజీఎం రజినీకాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్‌ నేతలు తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న జలమండలి సీజీఎం సుజాత, కార్పొరేటర్‌ రజితరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి